సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం ၊ 17 ၊ మార్చి ၊ 2023



ఇసుక లారీల అడ్డగింత

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న లారీలను గురువారం మహరాజుపేట కూడలిలో అడ్డుకున్నారు.

IIలో



కొన్ని రైళ్లు రద్దు

కేకే లైన్‌లోని మల్లిగుడ-ఛత్రిపుట్ మధ్య జరుగుతున్న పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు.

IIలో



ద్వితీయం.. ప్రశాంతం

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

IIలో

విశాఖ.. వికాసం

స్మార్ట్ సిటీ కింద రూ.50 కోట్ల కేటాయింపు

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రూ.302.04 కోట్లు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.141.79 కోట్లు



నక్కపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి

పాడేరు, నర్సీపట్నం మెడికల్ కళాశాలలకు నిధులు

- కాబోయే పరిపాలన రాజధానిగా ఉద్ఘాటన
- ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు
- రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి విశాఖకు అధిక ప్రాధాన్యం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర బడ్జెట్‌లో విశాఖ వికసించింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు అధిక ప్రాధాన్యం లభించింది. కాబోయే పరిపాలన రాజధానిపై ప్రత్యేక ఫోకస్ కనిపించింది. స్మార్ట్ సిటీ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధుల కేటాయింపు, నక్కపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి వంటివి రాష్ట్ర ప్రభుత్వం విశాఖపై చూపుతున్న శ్రద్ధకు దర్పణం పడుతున్నాయి. ఇంకా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనాలు విస్తృతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వివిధ వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ కానున్న విశాఖకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు బడ్జెట్‌లో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రకటించారు. ఈ నిధులతో నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వనున్నారు. రోడ్లు, డ్రెయిన్లు, పచ్చదనం, సుందరీకరణ, పార్కులు వంటివి మెరుగు పరచడంతో పాటు మరెన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఫలితంగా విశాఖలో పరిపాలన రాజధానికి అవసరమైన అభివృద్ధికి బాటలు పడనున్నాయి. దీంతో నగరం మరింత శోభాయమానంగా మారడానికి ఆస్కారమేర్పడనుంది. మరోవైపు స్మార్ట్ సిటీ నిధుల కింద విశాఖకు రూ.50 కోట్లు కేటాయించారు. ఇది కూడా విశాఖ నగర అభివృద్ధికి, బ్యూటిఫికేషన్‌కు ఎంతగానో దోహదపడనుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఈ బడ్జెట్‌లో 302.04 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఈ యూనివర్సిటీలో పలు అభివృద్ధి పనులు జరగనున్నాయి.

ఇంకా మరెన్నో..



సుజల స్రవంతికి రూ.141.79 కోట్లు

ఎంతో ప్రాధాన్యం కలిగిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి ఈ బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించి ఈ పథకంపై ప్రభుత్వానికున్న శ్రద్ధను చాటుకున్నారు. ఈ నిధులు ఈ పథకం శరవేగంగా పూర్తి కావడానికి దోహదపడుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. విశాఖపట్నం–చెన్నై కారిడార్ పరిధిలోని నక్కపల్లి ఇండస్ట్రియల్ క్లస్టర్ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందే వీలుంటుంది. మరోపక్క ఈ బడ్జెట్‌లో పర్యాటక, సాంస్కృతిక ప్రగతి కోసం రూ.1,291 కోట్లు కేటాయించారు. పర్యాటకపరంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న విశాఖలో ఆ రంగానికి మరింత ఆదరణ పెరిగే అభివృద్ధి పనులకు ఆస్కారం కలుగుతుంది. మరోవైపు విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి రూ.236.85 కోట్లు, ఈ కారిడార్ భూసేకరణ, పరిశ్రమల అవసరాలకు రూ.200.25 కోట్లు కేటాయించారు.

విశాఖలో గిరిజన పరిశోధన సంస్థ ఏర్పాటు, నిర్మాణానికి రూ.4.43 కోట్లు, విశాఖలో ఆక్టోపస్‌కు రూ.6.89 కోట్లు, పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ స్టేషన్ల ఆధునికీకరణకు రూ.33.58 కోట్లు, గ్రేహౌండ్స్ బలోపేతానికి, ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి రూ.25.87 కోట్లు, విశాఖ సాంకేతిక విద్య, ఉపాధి, శిక్షణ విభాగానికి రూ.44 కోట్లు చొప్పున కేటాయించారు. గిరిజన ప్రాంతంలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు రూ.120 కోట్లు, మైదాన ప్రాంతంలో మెడికల్ కాలేజీల ఏర్పాటుకు రూ.220 కోట్లు అలాట్ చేశారు. దీంతో పాడేరు, నర్సీపట్నంలో నిర్మించ తలపెట్టిన వైద్య కళాశాలలకు భారీగా నిధులు విడుదల కానున్నాయి. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ కోసం రూ.50కోట్లు కేటాయించగా.. విశాఖలోని మత్స్యకారులకు దాదాపు రూ.4 కోట్ల ప్రయోజనం చేకూరనుంది.

సంక్షేమ బడ్జెట్



సంక్షేమం, అభివృద్ధి సమన్వయం చేస్తూ రూపకల్పన చేసిన బడ్జెట్ ఇది. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. సమాజంలో పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం, సమానత్వం సాధనకు బడ్జెట్ ఉపయుక్తంగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సమాజంలో అట్టడుగు వర్గాలను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా, అభివృద్ధిని జోడించిన నిర్ణయాలు కనిపిస్తున్నాయి.

– ఆచార్య పి.విశ్వనాథం, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం

విద్యకు అధిక ప్రాధాన్యం



ప్రాథమిక, సాంకేతిక, ఉన్నత విద్యా రంగాలకు రూ.32 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం. సంక్షేమ పథకాలు, పరిశ్రమలకు సమ ప్రాధాన్యమిచ్చేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నవరత్నాల్లో పేర్కొన్న సంక్షేమ పథకాలను శతశాతం అమలు చేసే విధంగా కేటాయింపులు పెరుగుతున్నాయి. విద్యకు కేటాయింపులు పెంచడం ఫలితంగా విలువైన మానవ వనరులను తీర్చిదిద్దడం లక్ష్యంగా కనిపిస్తోంది.

– ఆచార్య ఎస్.పుల్లారావు, అర్థశాస్త్ర విభాగాధిపతి

నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం



రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి రూ.1166 కోట్లు కేటాయించడం మంచి పరిణామం. 192 నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయం అభినందనీయం. తద్వారా యువతలో సంపూర్ణ నైపుణ్యాలను వృద్ధి చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరచడం సాధ్యపడుతుంది. ఐటీఐల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన నిర్ణయం అభినందనీయం.

– డాక్టర్ జి.వీర్రాజు, విభాగాధిపతి, ప్రభుత్వ పాలన రాజనీతిశాస్త్ర విభాగం

మహిళా సంక్షేమానికి పెద్దపీట



మహిళా ఆధారిత పథకాలన్నింటికీ పెద్దపీట వేస్తూ బడ్జెట్‌లో కేటాయింపులున్నాయి. సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, మహిళా, శిశు సంక్షేమం, జగనన్న అమ్మ ఒడి తదితర పథకాలకు నిధులు కేటాయించారు. పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కేటాయింపులు ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి సూచికగా నిలుస్తాయి.

– కృపాజ్యోతి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు

పేదలకు అండగా బడ్జెట్



రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. ఈ బడ్జెట్‌తో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను పేదల పక్షపాతి అని మరోసారి చాటుకున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందనడానికి ఈ బడ్జెట్ ఉదాహరణ. వెనుకబడిన, దళిత వర్గాల సంక్షేమం కోసం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి పెద్దపీట వేశారు.

– పంచకర్ల రమేష్‌బాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

ఆర్బీకేల్లో బ్యాంకింగ్ సేవలు



సుస్థిరత, సుపరిపాలన, సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర వార్షిక బడ్జెట్ ఉంది. రైతులకు సున్నా వడ్డీ రుణాల కోసం రూ.500 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ అంశం. ఆర్బీకేల్లోనే బ్యాంకింగ్ సదుపాయాలు, రైతుల ఆదాయం పెంచే విధంగా ఆర్బీకే సేవలు విస్తృతం చేయడం, 8,837 ఆర్బీకేల నిర్మాణాలకు కేటాయింపులు.. ఇదీ రైతు సంక్షేమ బడ్జెట్‌గా నిలుస్తుంది.

– చింతకాయల అనిత, చైర్‌పర్సన్, డీసీసీబీ

విద్యారంగంపై ప్రత్యేక ఫోకస్



బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యం కల్పించారు. ప్రాథమిక, ఉన్నత విద్యాభివృద్ధితో పాటు ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించారు. 192 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. విద్యార్థి, యువత, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– సుంకరి రమణమూర్తి, వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన

అన్ని వర్గాలకు మేలు



జీవనోపాధి, సామర్థ్యం, అభివృద్ధి, సాధికారత, సామాజిక భద్రత, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం కల్పిస్తూ బడ్జెట్లో కేటాయింపులు జరిగాయి. అల్ప సంఖ్యాక వర్గాల వారికి రూ. 2240.09 కోట్ల కేటాయించడం, వైఎస్సార్ షాదీ తోఫా, జెరూసలెం హజ్ వెళ్లే యాత్రికులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం వంటి పథకాలకు కేటాయింపులు చేశారు.

– బొల్లవరపు జాన్ వెస్లీ, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్, కార్పొరేషన్ చైర్మన్

వ్యవసాయానికి రెట్టింపు కేటాయింపులు



టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయ బడ్జెట్ రూ. 19,078 కోట్లు ఉంటే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.41,436 కోట్లు కేటాయించారు. రైతులకు సబ్సిడీ రుణాలు, సున్నా వడ్డీకే రుణాలు, వ్యవసాయ యంత్రాల ఆధునికీకరణకు రూ.1,212 కోట్లు కేటాయించారు.

– చిక్కాల రామారావు, చైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ సలహా మండలి

బీసీలకు సముచిత స్థానం



రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.38,605 కోట్లు కేటాయించడం హర్షణీయం. రాష్ట్ర బడ్జెట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పించారు. నవరత్నాలతో కలుపుకుంటే దేశ చరిత్రలో గొప్ప బీసీల బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్ ద్వారా బీసీలకు దాదాపు రూ.లక్ష కోట్లు అందే అవకాశం ఉంది. గొప్ప బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి సంఘం తరపున కృతజ్ఞతలు.

–కర్రి వేణుమాధవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి

న్యూస్‌రీల్

విశాఖలో సెలబ్రిటీ క్రికెట్ పోటీలు

24న సెమీస్, 25న టైటిల్ పోరు

విశాఖ స్పోర్ట్స్: సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) ప్రస్తుత సీజన్‌లో నాకవుట్ పోటీలకు విశాఖలోని వైఎస్సార్ స్టేడియం వేదిక కానుంది. టీ20 ఫార్మెట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సెమీస్‌కు నాలుగు జట్లు చేరుకున్నాయి. తొలి సెమీస్ ఈనెల 24న మధ్యాహ్నం 2.30 గంటలకు కర్నాటక బుల్‌డోజర్స్,తెలుగు వారియర్స్ జట్ల మధ్య జరగనుంది. మరో సెమీస్ రాత్రి 7 గంటలకు భోజ్‌పురి దంబాగ్ జట్టుతో ముంబై హీరోస్ జట్టు తలపడనుంది. టైటిల్ పోరు ఈ నెల 25న రాత్రి ఏడు గంటలకు జరగనుంది. తొలుత ఈ పోటీలు ఈనెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లో జరగాల్సి ఉండగా విశాఖ స్టేడియానికి మార్పు చేశారు. తెలుగు వారియర్స్ కెప్టెన్‌గా అఖిల్, మెంటర్‌గా వెంకటేష్, అంబాసిడర్లుగా రెజీనా, ప్రణీత, అదాశర్మ ఉన్నారు. సచిన్‌జోషి, అశ్విన్, ధరమ్, ఆదర్స్, నిఖిల్, తరుణ్, విశ్వ, ప్రిన్స్, శుశాంత్ ఆల్ రౌండర్లుగా నంద, సామ్రాట్ బంతితో రాణిస్తున్నారు.

అమరజీవికి ఘన నివాళి



అమరజీవికి నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్, అదనపు కమిషనర్లు

దాబాగార్డెన్స్: పొట్టి శ్రీరాములు 123వ జయంతిని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, సెక్రటరీ పి.నల్లనయ్య, హార్టికల్చర్ డీడీ దామోదరరావు, డీసీ(రెవెన్యూ) ఎంవీడీ ఫణిరాం పాల్గొన్నారు.

డాక్టర్ ప్రసాద్‌కు కన్స్యూమర్ వారియర్ అవార్డు



అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

సీతంపేట: నగరానికి చెందిన వరహా వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రసాద్ మారెళ్ల నేషనల్ కన్స్యూమర్ వారియర్ అవార్డు అందుకున్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో గురువారం ఈ వేడుకలు నిర్వహించింది. 27 రాష్ట్రాల ప్రతినిధులు, అన్ని రాష్ట్రాల చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. వినియోగదారులకు కమిషన్ అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై సదస్సులో చర్చించారు. డాక్టర్ ప్రసాద్ మారెళ్ళ నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్‌లో సౌత్ ఇండియా చైర్మన్ ఫర్ మెడికల్ అండ్ ఫుడ్‌సేఫ్టీగా ఉంటూ విశేష సేవలందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కమిషన్ ఆయనకు అవార్డు ప్రకటించింది. ఒడిశా ప్లానింగ్ బోర్డు సభ్యులు ప్రసన్నకుమార్ పట్నాస్ చేతుల మీదుగా డాక్టర్ ప్రసాద్ అవార్డు అందుకున్నారు.

అప్పన్న దేవస్థానంలో అంతర్గత బదిలీలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు విభాగాలకు సంబంధించి అధికారులు, సిబ్బందికి అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో వి.త్రినాథరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ఏఈవోగా పని చేస్తున్న ఎస్.ఆనంద్‌కుమార్‌ను పెట్రోల్ బంక్స్, ఆడిట్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ విభాగానికి బదిలీ చేశారు. అన్నదానం ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.వి.వి.ఎస్.ఎస్.ఏ.ఎన్. రాజును ఆలయ ఏఈవోగా బదిలీచేశారు. సీ8 – సీ9 విభాగాల సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.సూర్యనారాయణను గోశాల పెట్రోల్ బంక్‌కు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ డి.కృష్ణను సింహగిరిపై వసతి విభాగానికి బదిలీ చేశారు. లీజెస్ విభాగంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.కార్తీక్‌నాగ్‌కు లీజెస్‌తో పాటు సీ8 – సీ9 విభాగం బాధ్యతలు అప్పగించారు. పాత గోశాల వద్ద ఈవో గెస్టు హౌస్‌లో వాషర్‌మెన్‌గా పని చేస్తున్న జి.సత్యనారాయణను పాత టోల్‌గేట్‌కు, విజయనగరంలోని ఎస్‌డీఎస్‌హెచ్ఎస్ హాస్టల్‌లో శానిటరీ స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శ్రీనివాసరావును పాత టోల్‌గేట్ వద్దకు మార్పు చేశారు.

ఉత్కంఠ

- కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- 7 రౌండ్లుగా లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు
- ఒక్కో రౌండ్‌లో 28 వేల ఓట్ల లెక్కింపు
- శుక్రవారం మధ్యాహ్నానికి తుది ఫలితం?



స్వర్ణభారతి స్టేడియంలో జరుగుతున్న కౌంటింగ్

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. గురువారం అర్ధరాత్రికి రెండు రౌండ్లు పూర్తికాగా.. ఇంకా ఐదు రౌండ్ల లెక్కింపు కొనసాగుతోంది. శుక్రవారం మధ్యాహ్నానికి తుది ఫలితం వెలువడే అవకాశం ఉంది. గురువారం ఉదయం 7 గంటలకు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా. మల్లికార్జున సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులు బయటకు తీసుకొచ్చారు. అనంతరం ర్యాండమైజేషన్ ద్వారా బాక్సులను ఓపెన్ చేసి అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు సమక్షంలో కట్టలు కట్టే ప్రక్రియ ప్రారంభించారు. మొత్తం 12 రౌండ్లలో బ్యాలెట్ పేపర్లు కట్టలు కట్టారు. బ్యాలెట్ పేపర్లు కట్టలు కట్టేందుకు దాదాపు 10 గంటల సమయం పట్టింది. అనంతరం.. ఒక్కో రౌండ్‌కు 28 వేల ఓట్లు చొప్పున 2,00,926 ఓట్లను ఏడు రౌండ్లుగా విభజించారు. ఒక్కో టేబుల్‌పై 1000 చొప్పున 28 టేబుల్స్‌పై మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో మొదటి రౌండ్ ప్రక్రియ సాయంత్రం 6.30 గంటల సమయంలో ప్రారంభమైంది. తొలి రెండు రౌండ్లలో టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు మెజార్టీ లభించింది.

పోస్టల్ బ్యాలెట్‌లో 228 ఓట్లు చెల్లలేదు

వివిధ ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునే వెసులుబాటు కల్పించారు. మొత్తం 767 పోస్టల్ బ్యాలెట్స్ కేటాయించగా కేవలం 583 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 228 ఓట్లు చెల్లని ఓట్లుగా పరిగణించారు. ప్రాధాన్యత అంకెలు వేయడంలో కొందరు ఉద్యోగులు తప్పులు చేస్తే.. ఓటుతో పాటు సర్వీస్ సర్టిఫికెట్ నకలు జత చేయడాన్ని మరికొందరు విస్మరించారు. మిగిలిన 355 ఓట్లను బ్యాలెట్‌బాక్సుల నుంచి కట్టలు కడుతున్న వాటిలో కలిపేశారు. పోస్టల్ బ్యాలెట్స్ ఓట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున స్వయంగా పరిశీలించారు.



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద పోలీసు కమిషనర్ శ్రీకాంత్ పరిశీలన

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

కౌంటింగ్ జరుగుతున్న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను అమలు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షించారు.



బ్యాలెట్ బాక్సులు తీసుకువస్తున్న సిబ్బంది



బ్యాలెట్‌లను కట్టలు కడుతున్న అధికారులు

టిఫిన్ కోసం వెళ్లి.. అనంత లోకాలకు..

- లారీ ఢీకొని ఇద్దరి దుర్మరణం
- అగనంపూడి ఫ్లైఓవర్‌పై ఘటన





మృతులు సోమశేఖర్, యూసఫ్



ఘటనా స్థలంలో మృతదేహాలు

కూర్మన్నపాలెం : జాతీయ రహదారి అగనంపూడి ఫ్లైఓవర్‌పై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆగి ఉన్న లారీని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరిని మరో లారీ వెనక నుంచి ఢీకొట్టి బలిగొంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా లంకెలపాలెం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన మహమ్మద్ యూసఫ్(30) స్థానికంగా పెట్రోల్ బంకు సమీపంలో పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన పైలా సోమశేఖర్(14) లంకెలపాలెం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై టిఫిన్ చేసేందుకు అగనంపూడి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి మరమ్మతుల కారణంగా ఆగి ఉన్న లారీని తప్పించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అదే మార్గంలో బొగ్గు లోడుతో వస్తున్న లారీ.. వారిని బలంగా ఢీకొట్టింది. ఇద్దరి తలలపై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో ఛిద్రమైపోయాయి. ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది. బైకులో ఉన్న లైసెన్స్ ఆధారంగా మృతులను గుర్తించారు. మృతుడు యూసఫ్‌కు తండ్రి సిరాజుద్దీన్, తల్లి ఫాతిమా ఉన్నారు. చేతికి అందొచ్చిన కొడుకు ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సోమశేఖర్‌కు తండ్రి ప్రసాద్, తల్లి వరలక్ష్మి, సోదరి ధనలక్ష్మి ఉన్నారు. సోమశేఖర్ తండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదన స్థానికులను కంటతడి పెట్టించింది. పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ వనం సత్యనారాయణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జాతీయ క్రీడల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా

చెస్ ఛాంపియన్‌గా నిలిచిన ఈశ్వరీసౌజన్య



విజేతలుగా నిలిచిన పాలిటెక్నిక్ విద్యార్థులు

మురళీనగర్: హైదరాబాద్‌లోని విజ్ఞాన జ్యోతి విద్యావిహార్ ఇంజినీరింగ్ కాలేజీ క్రీడా మైదానంలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించిన ఆలిండియా సౌత్ జోన్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. చెస్, వాలీబాల్ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీలో వివిధ రాష్ట్రాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ నుంచి 90 మంది పాల్గొన్నారు. వీరిలో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఉన్నారు. కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ అబ్బాస్ బేగ్ ఆధ్వర్యంలో వీరు శిక్షణ పొందారు. చెస్ క్రీడలో ఆర్.ఈశ్వరీ సౌజన్య విజేతగా నిలిచారు. వాలీబాల్ జట్టులో కె.సింహాద్రి, ఎం.బాలమురళీకృష్ణ పాల్గొని ముఖ్య భూమిక నిర్వహించి ఆంధ్రప్రదేశ్ జట్టును రన్నర్స్‌గా నిలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణమూర్తి, వివిధ శాఖాధిపతులు విజేతలు ఈశ్వరీసౌజన్య, సింహాద్రి, ఎం.బాలమురళీకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ అబ్బాస్ బేగ్‌ను గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అభినందించారు.

వైఎస్సార్‌ సీపీ నేత దాసరి రాజు హఠాన్మరణం


దాసరి రాజు(ఫైల్‌)


దాసరి రాజు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌

సింహాచలం: వైఎస్సార్‌ సీపీ 93వ వార్డు అధ్యక్షుడు దాసరి రాజు (42) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ప్రహ్లాదపురంలో నివాసం ఉంటున్న రాజుకు తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుండెపోటు వచ్చింది. వెంటనే అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఆయనకు ఎంతో అభిమానం. 93వ వార్డులో వైఎస్సార్‌ సీపీకి బలమైన నేత. శారదాపీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి ప్రియశిష్యుడు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ ముఖ్య అనుచరుడు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ.. పిలిస్తే పలికే నేతగా మన్ననలు పొందారు. ఆయన మృతితో ప్రహ్లాదపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ దాసరి రాజు మరణవార్త విని హుటాహుటిన విజయవాడ నుంచి ప్రహ్లాదపురం చేరుకున్నారు. రాజు పార్థివదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీకి, వ్యక్తిగతంగా తనకు దాసరి రాజు లేని లోటు తీర్చలేనిదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, డిప్యూటీ మేయర్‌ జియ్యాని శ్రీధర్‌, 93వ వార్డు కార్పొరేటర్‌ రాపరి కన్నా, 94, 97, 98 వార్డుల అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్‌, కొలుసు ఈశ్వరరావు, పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి బండారు అప్పలనాయుడు తదితరులు రాజు మృతదేహం వద్ద నివాళి అర్పించారు. ప్రహ్లాదపురం ప్రధాన రోడ్డులోని వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేశారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ప్రహ్లాదపురం నుంచి బాలాజీనగర్‌ వరకు ఆయన అంతిమయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు. దాసరి రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజు తండ్రి అచ్చిబాబు కాంగ్రెస్‌ తరపున ఎంపీటీసీగా పనిచేశారు.

ద్వితీయం.. ప్రశాంతం

- ఇంటర్‌ సెకండియర్‌ పరీక్షలు ప్రారంభం
- 98.06 శాతం మంది విద్యార్థులు హాజరు
- ముగ్గురు విద్యార్థులు డిబార్‌


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సచివాలయ మహిళా పోలీస్‌


బీవీకే కాలేజీ వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

విశాఖ విద్య: ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గురువారం ద్వితీయ భాష తెలుగు/సంస్కృతం పరీక్ష జరిగింది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 128 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, 8.30 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించారు.

98.06 శాతం హాజరు

తొలిరోజు పరీక్షకు 98.06 శాతం హాజరు నమోదైంది. జనరల్‌ కోర్సు విద్యార్థులు 45,692 మందికి గాను 44,894 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌ 4,277 మందికి 4,108 మంది హాజరయ్యారు. జనరల్‌, ఒకేషనల్‌ కోర్సులు కలిపి మొత్తం 49,969 మంది విద్యార్థులకు 49,002 మంది హాజరైనట్లు ఇంటర్మీడియెట్‌ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి. ఉమారాణి వెల్లడించారు.

విశాఖలో ఇద్దరు, అల్లూరిలో ఒకరు డిబార్‌

పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులను డిబార్‌ చేశారు. విశాఖ నగరంలోని శ్రీవిశ్వ కాలేజీ, భీమునిపట్నంలో కేథరిన్‌ కాలేజీ, అల్లూరి జిల్లా పాడేరు ప్రభుత్వ జూనియర్‌ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్‌ కేసులు నమోదైనట్లు ఆర్‌ఐవో ఉమారాణి తెలిపారు. ఫ్లయింగ్‌ స్క్వాడ్‌, సిట్టింగ్‌ స్క్వాడ్‌ బృందాలు పరీక్ష కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలియజేశారు.

హాల్‌టికెట్‌ లేక.. పరీక్ష రాయలేక..


బీవీకే కాలేజీ వద్ద హాల్‌ టికెట్‌ లేని విద్యార్థితో మాట్లాడుతున్న ఎస్‌ఐ ధర్మేంద్ర

ఫీజు కట్టలేదని కాలేజీ యాజమాన్యం హాల్‌ టిక్కెట్‌ ఇవ్వకపోవడంతో ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. విశాఖ నగరంలోని బీవీకే కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద ఇది వెలుగులోకి వచ్చింది. హాల్‌ టిక్కెట్‌ లేకుండా రావడంతో, కేంద్రం నిర్వాహకులు ఇద్దరు విద్యార్థులను బయటకు పంపించారు. అక్కడే ఉన్న ద్వారకానగర్‌ ఎస్‌ఐ ధర్మేంద్ర విద్యార్థులతో మాట్లాడగా.. విశాఖలోని శ్రీ నగర్‌లో ఓ ప్రైవేటు కాలేజీలో ఒకేషనల్‌ కోర్సు చేస్తున్న తమకు ఫీజు బకాయి వల్ల హాల్‌ టిక్కెట్‌ ఇవ్వలేదని చెప్పారు. స్పందించిన ఎస్‌ఐ అక్కడ ఉన్న కానిస్టేబుల్‌ను వెంట పంపించి, ఆ విద్యార్థులను కాలేజీకి తీసుకెళ్లి హాల్‌ టిక్కెట్లు ఇప్పించే ఏర్పాట్లు చేశారు. తిరిగి వారు కేంద్రానికి వచ్చినప్పటికీ, సమయం మించిపోయిందనే కారణంతో వారిని పరీక్ష రాసేందుకు నిర్వాహకులు అనుమతించలేదు. దీంతో వారు నిరాశతో వెనుదిరిగారు.

అమరజీవి సేవలు ఎనలేనివి


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పంచకర్ల రమేష్‌ బాబు

మహారాణిపేట: మద్దిలపాలెంలోని వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్రానికి పొట్టి శ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. 51వ వార్డు కార్పొరేటర్‌ రెయ్యి వెంకట రమణ, మాజీ ఎమ్మెల్యే ఎస్‌.ఎ.రెహ్మాన్‌, మార్కెట్‌ కమిటీ మాజీ అధ్యక్షుడు అల్లంపల్లి రాజబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు కృపా జ్యోతి, నాయకులు బొండా ఉమామహేశ్వరరావు, బోని శివరామకృష్ణ, మన్యాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు పేర్ల విజయచందర్‌, పైడి శ్రీను, సుశీల, పార్టీ నాయకులు చొక్కర శేఖర్‌, వెంకటరావు, నల్ల రవికుమార్‌, ప్రేమ్‌ కుమార్‌, చరణ్‌, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

ఇంటి, ఖాళీ జాగా పన్నుపై వడ్డీ రద్దు

అల్లిపురం: 2022–2023 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను, ఖాళీ జాగా పన్ను బకాయిలపై వడ్డీ రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి గురువారం జీవో నంబర్‌ 34 విడుదల చేశారు. ఈ నెల 31లోగా పన్ను బకాయిలు ఒకేసారి చెల్లించిన వారికి ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

షిప్‌యార్డ్‌ మాజీ అధికారులపై చర్యలకు డిమాండ్‌


మాట్లాడుతున్న విశాఖ పబ్లిక్‌ సెక్టార్‌ కో–ఆర్డినేషన్‌ కమిటీ కో కన్వీనర్‌ కుమారమంగళం

దాబాగార్డెన్స్‌(విశాఖ దక్షిణ): రక్షణ రంగంలో పదవీ విరమణ చేసిన తర్వాత హిందుస్థాన్‌ షిప్‌యార్డ్‌లో చైర్మన్‌, ఉన్నత స్థాయి అధికారులుగా మళ్లీ బాధ్యతలు చేపట్టి వేతనాల రూపంలో కోట్ల రూపాయలు తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశాఖ పబ్లిక్‌ సెక్టార్‌ కో–ఆర్డినేషన్‌ కమిటీ కన్వీనర్‌ ఎస్‌.జ్యోతీశ్వరరావు, కో కన్వీనర్‌ కుమారమంగళం డిమాండ్‌ చేశారు. ఎల్లమ్మతోటలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిటైరయ్యాక అదే ప్రభుత్వ పరిశ్రమలో ఉన్నత స్థానంలో చేరితే జీతభత్యాలు మినిమం స్కేల్స్‌లో నిర్ణయించాలన్నారు. కానీ షిప్‌యార్డ్‌లో హేమంత్‌ ఖత్రీ, సందీప్‌ పరిజా, జి.వెంకటేశ్వర్లు, అనిల్‌ దంగవల్‌, కుంజమన్‌ మాథ్యూ, వై.శివరామకృష్ణన్‌, జె.అమరింద్‌ సింగ్‌, గిరిదీప్‌ సింగ్‌, విజయకుమార్‌, పీఎం సాల్టీ, రవి ముత్తుస్వామి, మిత్ర, ఎల్‌వీ శరత్‌బాబు సుమారు రూ.5 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా జీతాల రూపంలో తీసుకున్నట్టు కాగ్‌ తన రిపోర్ట్‌లో పేర్కొందన్నారు. ఎల్‌అండ్‌ఎం సిరీస్‌ కార్మికులను ఫిక్స్‌డ్‌ టర్మ్‌ ఉద్యోగులుగా మార్చి వారి జీవితాలతో ఆడుకున్న శరత్‌బాబు, ఇతర అధికారుల నుంచి అదనంగా తీసుకున్న వేతనాలను అణాపైసలతో సహా వసూలు చేయాలన్నారు. ఎల్‌అండ్‌ఎం సిరీస్‌ కార్మికులను తక్షణమే పర్మినెంట్‌ చేసి, సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఇసుక లారీల అడ్డగింత

తగరపువలస: శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఇసుక రీచ్‌ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న లారీలను గురువారం మహరాజుపేట కూడలిలో విశాఖ జిల్లా క్వారీలారీ యజమానుల సంఘం ప్రతినిధులు అడ్డుకున్నారు. రవాణా శాఖ అధికారులు లారీలను తనిఖీ చేసి.. 10 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా లారీ యజమానుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఇసుక రీచ్‌ల నుంచి నేరుగా భీమిలి యార్డుకు తరలించి అక్కడ నుంచి లబ్ధిదారులకు చేరవేయాల్సి ఉందన్నారు. దీనికి విరుద్ధంగా కాంట్రాక్ట్‌ పొందిన జేపీ, దాని అనుబంధ సంస్థలు యార్డుకు కాకుండా వే బిల్లులు మార్చి నేరుగా జగనన్న కాలనీల వద్ద ఇళ్ల నిర్మాణాలకు చేరవేయడాన్ని తప్పు పట్టారు. అప్పట్లో ప్రభుత్వం టన్ను ఇసుకకు కిలోమీటరు రూ.4.80 పైసలు చెల్లించేదన్నారు. తరువాత ఈ ధరను రూ.3.85పైసలకు తగ్గించిందన్నారు. ఈ ధర తమకు గిట్టుబాటు కాకపోవడంతో రూ.4 అడిగినా ఇవ్వకపోవడంతో విరమించుకున్నామన్నారు. కాంట్రాక్ట్‌ పొందిన జేపీ దాని అనుబంధ సంస్థ కేకేఆర్‌లు కాకినాడ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి లారీలను తీసుకువచ్చిన తక్కువ కిరాయికి తిప్పుతున్నారని చెప్పారు. ఇందులో లబ్ధి పొందేందుకు గాను యార్డులో డంప్‌ చేయకుండా నేరుగా లబ్ధిదారులకు చేరవేయడం తగదని పేర్కొన్నారు. దీనిపై జేపీ సంస్థ అధికారులు, స్థానిక లారీ యజమానులు, రవాణాశాఖ అధికారులతో చర్చలు జరిపారు. చర్చలను ఈ నెల 20కు వాయిదా వేశారు. దీంతో స్థానిక లారీ యజమానులు ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేశారు. సంఘం మాజీ అధ్యక్షుడు నమ్మి మాధవరావు, ప్రతినిధులు కర్రి వెంకటరమణ, కొయ్య శ్రీనివాసరెడ్డి, మద్దిల వెంకట అప్పలరాజు, రౌతు రామకృష్ణ పాల్గొన్నారు.

ఉక్కు పోరు మరింత ఉధృతం

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ


సంఘీభావం తెలుపుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు

సీతంపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, 100 శాతం వాటాలు విక్రయించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్‌ చేసింది. ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కమిటీ చైర్మన్‌ డి.ఆదినారాయణ మాట్లాడారు. నాడు కేంద్ర ప్రభుత్వం రూ.4,890 కోట్ల పెట్టుబడి పెట్టి, మరో నాలుగు వేల కోట్ల బ్యాంకు రుణాల ద్వారా 3.2 మిలియన్‌ టన్నుల సామర్థ్యంతో పరిశ్రమ స్థాపించిందన్నారు. కార్మికుల శ్రమతో 3.2 మిలియన్‌ టన్నుల నుంచి 7.3 మిలియన్‌ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మూడు లక్షల కోట్ల రూపాయల విలువకు ప్లాంట్‌ చేరుకుందన్నారు. అంత విలువైన విశాఖ ఉక్కును కారు చౌకగా అదానీకి కట్టబెట్టడానికి కేంద్రం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. విశాఖ ఉక్కుకు గనులు కేటాయించకుండా, రా మెటీరియల్‌ సరఫరా చేయకుండా, ఓ బ్లాస్ట్‌ఫర్నేస్‌ మూసివేయించి, వడ్డీ రేట్లు పెంచి, రుణాలు మంజూరు కాకుండా చేసి ప్లాంట్‌ నష్టపరిచేలా కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. ఈ చర్యలతో ప్లాంట్‌ ఈ ఏడాది రూ.200 కోట్ల నష్టాలు చవిచూస్తోందన్నారు. కేంద్రం కుట్రల నుంచి విశాఖ ఉక్కును పరిరక్షించుకోవడానికి రెండున్నరేళ్లుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ నెలాఖరు నుంచి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. కమిటీ కో కన్వీనర్‌ ఎస్‌.రామచంద్రరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్లాంట్‌ వెయ్యి కోట్ల రూపాయల లాభాలు ఆర్జించిందని గుర్తు చేశారు. స్టీల్‌ ప్లాంట్‌ను 100 శాతం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. కమిటీ ప్రతినిధులు జె.అయోధ్యరామ్‌, డి.వి.రమణారెడ్డి, ఎం.వెంకటరావు, బి.డేవిడ్‌, పడాల రమణ, వై.మస్తానప్ప పాల్గొన్నారు.

ఖైదీ దాడిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారంలో ఓ ఖైదీ మరో ఖైదీపై దాడి చేసిన సంఘటనపై గురువారం ఆరిలోవ పోలీస్‌ స్టేషన్‌లో జైలు అధికారులు ఫిర్యాదు చేశారు. జైల్‌ సూపరింటెండెంట్‌ ఎస్‌.రాహుల్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మీర్‌ ఖానా కడప జైల్‌లో శిక్ష అనుభవించేవాడు. అక్కడ అతని ప్రవర్తన బాగాలేకపోవడంతో జైల్‌ శాఖ అధికారులు రెండేళ్ల క్రితం విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. తాను నమాజ్‌ చేసుకుంటానని గోల చేయొద్దంటూ ఇతర ఖైదీలకు తరచూ చెప్పేవాడు. బుధవారం సాయంత్రం అతనికి సమీపంలో ఉన్న ఓ ఖైదీ బిగ్గరగా మాట్లాడడంతో కర్రతో పొట్టపై పొడిచాడు. దీంతో వెంటనే జైల్‌ అధికారులు గాయపడిన ఖైదీని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి స్వల్ప గాయం కావడంతో వైద్యం చేసి వెంటనే జైల్‌కు పంపించేశారు. ఈ ఘటనపై గురువారం జైల్‌ అధికారులు.. మీర్‌ఖానా తోటి ఖైదీపై దాడి చేసినట్లు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా మీర్‌ఖానా కిటికీ నుంచి తీసిన సన్నని ఇనుప ఊచతో దాడి చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

హాస్టల్‌ విద్యార్థులకు అరుదైన అవకాశం


ఢిల్లీకి చేరిన విద్యార్థులు, అధికారుల బృందం

విశాఖ విద్య: విశాఖ జిల్లాలకు చెందిన సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ వసతి గృహ విద్యార్థులకు అరుదైన అవకాశం దక్కింది. ఇండియన్‌ బ్యాంకు ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా 14 మంది విద్యార్థులను స్టడీ టూర్‌ పేరిట ఢిల్లీకి తీసుకెళ్లారు. విద్యార్థులకు తోడుగా పెందుర్తి, గాజువాక సంక్షేమ వసతి గృహ అధికారిణిలు ఎ.సత్యవతి, కే అలివేలు మంగ వెళ్లారు. గురువారం వీరంతా ఢిల్లీకి చేరుకున్నారు. వీరికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ అభినందనలు తెలుపుతూ మంత్రి కార్యాలయం నుంచి ట్విట్టర్‌లో ట్వీట్‌ చేశారు. రెండు రోజుల పాటు వీరంతా ఢిల్లీ పరిసర ప్రాంతాలను సందర్శించనున్నారు. తమ పిల్లలకు ఇలాంటి మంచి అవకాశం లభించటం ఎంతో ఆనందంగా ఉందని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్‌ డైరెక్టర్‌ డీ.వీ.రమణమూర్తి తెలిపారు.

ఏఎంసీకి సీఎస్‌ రావు భౌతికకాయం


సీఎస్‌ రావు భౌతికకాయాన్ని ఏఎంసీకి అందజేస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట : ప్రజా స్పందన అధ్యక్షుడు చాగంటి సుందరరావు (సీఎస్‌రావు) భౌతిక కాయాన్ని అవయవ దానం కోసం గురువారం ఆంధ్రా మెడికల్‌ కాలేజీ అనాటమీ విభాగానికి అందజేశారు. ఆయన బుధవారం మృతి చెందిన సంగతి తెలిసిందే. గురువారం ఆయన కుమారులు హెచ్‌సీఎల్‌ టెక్నాలజీస్‌ లిమిటెడ్‌ (ఢిల్లీ)లో ఉపాధ్యక్షుడిగా పని చేసి రిటైర్‌ అయిన సి.దక్షిణామూర్తి, సెంట్రల్‌ ఎక్సైజ్‌ కస్టమ్స్‌ సీనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ సి.జోగారావు, హైదరాబాద్‌ టెక్‌ మహీంద్ర మేనేజర్‌గా విధులు నిర్వర్తించి రిటైర్‌ అయిన సి.విశ్వనాథం, ఇతర కుటుంబ సభ్యులు ఆంధ్రా మెడికల్‌ కాలేజీ అనాటమీ డిపార్టుమెంట్‌కు రావు భౌతికకాయాన్ని అందజేయగా డిపార్టుమెంట్‌ ఒక సర్టిఫికెట్‌ జారీ చేసింది.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి


మృతి చెందిన అప్పలనాయుడు

కూర్మన్నపాలెం: అగనంపూడి పరిధిలోని క్యాన్సర్‌ ఆస్పత్రి సమీపంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైక్‌ ఢీ కొన్న ఘటనలో.. కోడూరు గ్రామానికి చెందిన బొబ్బర అప్పలనాయుడు(30) మృతి చెందాడు. ఓ ప్రైవేట్‌ కంపెనీలో విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న అప్పలనాయుడును అదే మార్గంలో ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న అగనంపూడి దరి గన్నువానిపాలేనికి చెందిన జి.హేమచందు బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో అప్పలనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. హేమచందు తీవ్రంగా గాయపడగా.. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య కోమలి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: గుంతకల్‌ డివిజన్‌ పరిధిలో బేతంచర్ల–రంగాపురం–మల్కాపురం స్టేషన్ల పరిధిలో రెండవ లైన్‌ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు నిర్దేశించిన తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్‌ సీనియర్‌ డివిజనల్‌ కమర్షియల్‌ మేనేజర్‌ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

- భువనేశ్వర్‌–బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు, బెంగళూరు–భువనేశ్వర్‌(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు డోన్‌, గుంతకల్‌, గుత్తి మీదుగా కాకుండా వయా ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్‌ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మార్గంలో ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి ఫోర్ట్‌ స్టేషన్లలో తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.
- పూరిలో ఈ నెల 24న బయలుదేరే పూరి–యశ్వంత్‌పూర్‌(22883) గరీబ్‌రథ్‌ ఎక్స్‌ప్రెస్‌, యశ్వంత్‌పూర్‌లో ఈ నెల 25న బయలుదేరే యశ్వంత్‌పూర్‌–పూరి(22884) గరీబ్‌రథ్‌ డోన్‌ మీదుగా కాకుండా వయా ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్‌ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి ఫోర్ట్‌ స్టేషన్లలో ఈ రైలుకు తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.
- హౌరాలో ఈ నెల 22న బయలుదేరే హౌరా–శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం (22831), శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంలో ఈ నెల 24న బయలుదేరే శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం–హౌరా (22832) ఎక్స్‌ప్రెస్‌ డోన్‌, గుత్తి మీదుగా కాకుండా వయా ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్‌ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది.ఈ మార్గంలో ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి ఫోర్ట్‌ స్టేషన్లలో ఈ రైలుకు తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.

విజయవాడ డివిజన్‌ పరిధిలో..

సికింద్రాబాద్‌ డివిజన్‌ పరిధిలో గంగినేని–ఎర్రుపాలెం స్టేషన్ల మధ్య జరుగుతున్న నాన్‌ఇంటర్‌ లాకింగ్‌ పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లిస్తున్నారు.

- విశాఖపట్నం–లోకమాన్యతిలక్‌ టెర్మినస్‌ (18519) ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు, లోకమాన్య తిలక్‌ టెర్మినస్‌–విశాఖపట్నం (18520) ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కాజీపేట మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరులో తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.
- యశ్వంత్‌పూర్‌లో ఈ నెల 19న బయలుదేరే యశ్వంత్‌పూర్‌–టాటానగర్‌ (18112) ఎక్స్‌ప్రెస్‌ వరంగల్‌, ఖమ్మం మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలుకు గుంటూరులో తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.
- సికింద్రాబాద్‌లో ఈ నెల 21న బయలుదేరే సికింద్రాబాద్‌–షాలిమార్‌(12774) ఏసీ ఎక్స్‌ప్రెస్‌ వరంగల్‌, రాయనపాడు మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు, విజయవాడలో తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.
- సంబల్‌పూర్‌ –నాందేడ్‌ (20809) ఈ నెల 19, 20, 21 తేదీల్లో, నాందేడ్‌– సంబల్‌పూర్‌(20810) ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 20, 21 తేదీల్లో రాయనపాడు, కాజీపేట మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. విజయవాడ, గుంటూరులో ఈ రైలుకు తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.
- విశాఖపట్నంలో ఈ నెల 20న బయలుదేరే విశాఖపట్నం–నాందేడ్‌ (20811), నాందేడ్‌లో ఈ నెల 19న బయలుదేరే నాందేడ్‌– విశాఖపట్నం (20812) ఎక్స్‌ప్రెస్‌ రాయనపాడు, కాజీపేట మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలుకు విజయవాడ, గుంటూరులో తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.
- విశాఖపట్నం–సికింద్రాబాద్‌ (12739) గరీబ్‌రథ్‌ ఈ నెల 19, 20వ తేదీల్లో, సికింద్రాబాద్‌–విశాఖపట్నం(12740)) గరీబ్‌రథ్‌ ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 19, 20వ తేదీల్లో ఖమ్మం, వరంగల్‌ మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. గుంటూరులో తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు.
- ఈ నెల 21న బయలుదేరే ముంబయి ఛత్రపతి శివాజీ టెర్మినస్‌–భువనేశ్వర్‌(11019) కోణార్క్‌ ఎక్స్‌ప్రెస్‌ కాజీపేట, వరంగల్‌, మహబూబాబాద్‌, ఖమ్మం, మధిర స్టేషన్ల మీదుగా కాకుండా వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది. గుంటూరులో తాత్కాలిక హాల్ట్‌ ఇచ్చారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించి రైల్వేకు సహకరించాలని అధికారులు కోరారు.

కొన్ని రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లోని మల్లిగుడ–ఛత్రిపుట్‌ మధ్య జరుగుతున్న పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్‌ డివిజన్‌ సీనియర్‌ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు

- విశాఖపట్నం–కోరాపుట్‌(18512) ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 17, 20 తేదీల్లో రద్దు
- కోరాపుట్‌ –విశాఖపట్నం(18511) ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 18, 21 తేదీల్లో రద్దు
- కోరాపుట్‌–విశాఖపట్నం(08545) పాసింజర్‌ స్పెషల్‌ ఈనెల 23న రద్దు
- కిరండూల్‌–విశాఖపట్నం(08552) పాసింజర్‌ స్పెషల్‌ ఈ నెల 23న రద్దు
- విశాఖపట్నం– కాకినాడ (17267/17268) మెము ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 17, 18 తేదీల్లో రద్దు
- విశాఖపట్నం–రాజమండ్రి (07466/ 07467) మెము ఈ నెల 17,18 తేదీల్లో రద్దు

గమ్యం కుదించిన రైళ్లు

- కిరండూల్‌–విశాఖపట్నం(08552) ఈ నెల 17న కోరాపుట్‌ వరకే నడుస్తుంది. అక్కడ నుంచి తిరిగి కిరండూల్‌ చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కోరాపుట్‌(08546) పాసింజర్‌ స్పెషల్‌ ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు రాయగడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కోరాపుట్‌–విశాఖపట్నం(08545) పాసింజర్‌ స్పెషల్‌ ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు రాయగడ నుంచే బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్‌(08551) స్పెషల్‌ ఈ నెల 17 నుంచి 22 వరకు అరకు వరకు మాత్రమే నడుస్తుంది. ఈ తేదీల్లో అరకు–కిరండూల్‌ మధ్య ఈ రైలు రాకపోకలు సాగించదు.